సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ): ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ గోల్డ్ సిక్కా శనివారం బేగంపేటలో గోల్డ్ మెల్టింగ్ ఏటీఎంను ఆవిష్కరించింది. ఈ ఏటీఏం ద్వారా బంగారానికి సంబంధించిన అన్ని లావాదేవీలు చేసుకోవ్చని సంస్థ సీఈఓ తరుజ్ తెలిపారు. బంగారం కొనుగోలు, అమ్మకం, ఎక్స్‌ఛేంజింగ్ తదితర సేవలు పొందొచ్చని వివరించారు.

నీట్‌కు ఏర్పాట్లు పూర్తి

మేడ్చల్ కలెక్టరేట్, మే 3: నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 13 పరీక్ష కేంద్రాలకు 4,336 మంది అభ్యర్థులు హాజరవుతున్నారన్నారు. అభ్యర్థులను ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని, ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరని.. ఈ విషయాన్ని గమనించి పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయానికి చేరుకోవాలని కోరారు.

పరీక్ష కేంద్రాల వద్ద 163సెక్షన్

సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ): సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్ని నీట్ పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి తెలిపారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 200మీటర్ల దూరం వరకు సెక్షన్ అమలులో ఉంటుందని, ఈ నేపథ్యంలో పరీక్షా కేంద్రాలకు 100మీటర్ల దూరంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని సీపీ తెలిపారు.

ఎట్టకేలకు ఎలివేటెడ్ ప్రాజెక్టులో కదలిక

- ఇరుకైన ప్రాంతాలను అన్వేషిస్తున్న హెచ్ఎండీఏ
- రోడ్లను విస్తరించేందుకు కసరత్తు
- ప్యారడైజ్ - సుచిత్ర, జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ మార్గంలో పనులు

సిటీబ్యూరో, మే 3(నమస్తే తెలంగాణ): ఎలివేటెడ్ కారిడార్‌ను పట్టాలెక్కించేందుకు హెచ్ఎండీఏ కసరత్తు చేస్తోంది. శంకుస్థాపన తర్వాత కొంత కాలంగా ఈ ప్రాజెక్టులో ఎలాంటి కదలిక లేకుండా పోయింది. కనీసం భూసేకరణలోనూ ఎలాంటి ప్రక్రియ లేదు. ఈ క్రమంలో ప్రభుత్వం అట్టహాసంగా చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు భవిత్యం ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో ఇరుకైన ప్రాంతాలను విస్తరించేందుకు కార్యాచరణ రూపొందించింది. రెండు మార్గాల్లో ఉండే ఇరుకైన ప్రాంతాలను వెడల్పు చేసేందుకు ప్రణాళికలను రూపొందించనున్నారు. ఈ బాధ్యతలను ఇంజనీరింగ్ కన్సల్టెన్సీకి అప్పగించనుండగా, టెండర్లు మొదలుపెట్టింది. నార్త్ సిటీకి మెరుగైన రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చేలా రూపొందించిన ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులో మరో అడుగు పడింది. ఇప్పటికీ భూసేకరణ పూర్తి కాకున్నా... ఈ మార్గంలో రోడ్లను విస్తరించనున్నారు. దీనికోసం జాతీయ రహదారి – 44, రాష్ట్ర రహదారి –1లోని రాజీవ్ రహదారి వెంబడి ఈ పనులు చేపట్టనున్నారు. మొత్తం 16 కిలోమీటర్ల పొడవైన ఎలివేటెడ్ కారిడార్ కోసం భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుండగా... తాజాగా ఆయా మార్గాల్లో రోడ్లను ప్రాజెక్టుకు అనుగుణంగా ముందుగా వెడల్పు చేయనున్నారు. దీంతో ప్రాజెక్టు పనులు మొదలు కానున్నాయి.

కీలకంగా మారిన భూసేకరణ..

రెండు మార్గాల్లో భూసేకరణ ప్రక్రియ కీలకంగా మారింది. ఇప్పటికీ ఇరు మార్గాల్లో భూములు ఇచ్చేందుకు స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని సామరస్యపూరకంగా భూములు సేకరించేందుకు నిత్యం గ్రామ సభలు నిర్వహిస్తూనే ఉంది. కానీ భూములు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. పైగా ప్రాజెక్టు వలన కలిగే నష్టంపై కోర్టులను ఆశ్రయిస్తున్నారు. అదేవిధంగా రక్షణ శాఖ కూడా భూముల బదలాయింపు కోసం మెలికలు పెడుతూనే ఉంది. పరిహారంతో పాటు, ఆయా మార్గాల్లో కూలిపోనున్న నిర్మాణాలను కట్టించి ఇస్తేనే ప్రాజెక్టు కోసం భూములు ఇస్తామని షరతులు విధించడంతో ఈ ప్రక్రియలో అనుకున్నంత వేగంగా జరగడం లేదు. కానీ హెచ్ఎండీఏ తాజాగా ఆ రెండు మార్గాల్లో ఇరుకైన ప్రాంతాలను గుర్తించి, విస్తరించేందుకు కసరత్తు మొదలుపెట్టింది.

ఉపాధి పనుల పరిశీలన

మోమిన్‌పేట మండలంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ సృజన

వికారాబాద్, మే 3: ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉపాధి పనులు చేపట్టాలని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ సృజన అధికారులకు సూచించారు. శనివారం మోమిన్‌పేట మండలంలోని జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను జిల్లా కలెక్టర్‌ప్రతీక్ జైన్‌తో కలిసి క్షేత్రస్థాయిలో కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ... ఉపాధి పథకం కింద ఎన్ని రోజులు పని చేస్తున్నారని, రోజుకు 307 రూపాయల చొప్పున చెల్లిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కింద పొలాలకు కట్టలు వేసుకోవడమే.. కాకుండా చెక్ డ్యామ్ ల నిర్మాణాలను పెద్ద మొత్తంలో చేపట్టలని ఆమె అధికారులు సూచించారు. ఆదాయ వనరులు కల్పించే పంటలు సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని ఆమె సూచించారు. ఉద్యానవన పంటలతో పాటు మునగ, జామ , మామిడి, సీతాఫల్ పంటలను సాగు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని ఆమె అధికారులకు సూచించారు. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ పర్యటన భాగంగా అవెన్యూ ప్లాంటేషన్, కాంపోస్ట్ షెడ్, ఫామ్ పాండ్ నిర్మాణ పనులు పరిశీలించారు. కమిషనర్ పర్యటనలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్డీఓ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, ఎంపీడీఓలు విజయలక్ష్మి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యానపంటలను ప్రోత్సహించాలి

నవాబుపేట: ఉపాధిహామీ కింద ఉద్యానవన పంటలు వేసుకునేందుకు ప్రోత్సహించాలని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ సృజన అధికారులకు సూచించారు. శనివారం మండలంలో జాతీయ ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఉపాయోగపడే విధంగా ఉపాధిహామీ పనులు ఉండాలని ఆమె తెలిపారు. వట్టిమీనాపల్లిలోని హరితహారం నర్సరీ, నవాబుపేట గ్రామ సమీపంలో చేపడుతున్న ఫామ్ పాండ్ పనులను పరిశీలించారు.

పక్కకు వెళ్లు.. నీ పని చూసుకో..

- సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం.. కార్పొరేటర్ మధ్య మాటమాట..
- సముదాయించిన మంత్రిపొన్నం
- ఫ్లెక్సీపై ఖైరతాబాద్ కార్పొరేటర్ ఫొటో పెట్టకపోవడంపై రగడ
- ఉద్దేశపూర్వకంగానే చేశారంటూ.. విజయారెడ్డి అనుచరుల అసంతృప్తి
- ఆదర్శబస్తీలో సన్నబియ్యం పంపిణీ.. లబ్ధిదారుడి ఇంట్లో భోజనం

హిమాయత్ నగర్, మే 3: హిమాయత్‌నగర్ లోని ఆదర్శబస్తీలో శనివారం 602 రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే దానం నాగేందర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్ విజయారెడ్డి తో పాటు అధికారులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ గాంధీకుటీర్ బస్తీలో లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేశారు. అయితే ఆదర్శబస్తీలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం సందర్భంగా ప్రొటోకాల్ రగడ నెలకొంది. ఖైరతాబాద్ కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి ఫొటోను ఫ్లెక్సీపై పెట్టకపోవడంతో ఎమ్మెల్యే దానంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. సన్న బియ్యం పంపిణీ చేస్తున్న క్రమంలో దానం పక్కన విజయారెడ్డి నిల్చొని ఉండగా, ఆమెను పక్కకు వెళ్లాలి అని దానం చెప్పారు. దీంతో విజయారెడ్డి 'నీ పని చూసుకో' అంటూ ఘాటుగా సమాధానం ఇచ్చారు. అక్కడే ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకుని విజయారెడ్డిని సముదాయించారు. కార్యక్రమం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ వెళ్తున్న సమయంలో విజయారెడ్డి అనుచరులు, కాంగ్రెస్ మహిళా నేతలు పొన్నంతో ఈ అంశంపై మాట్లాడగా, తరువాత మాట్లాడుదామని చెప్పి వెళ్లిపోయారు. ఉద్దేశపూర్వకంగానే విజయారెడ్డి ఫొటో పెట్టలేదని, పార్టీ కోసం పనిచేసే వారిని గుర్తించడం లేదని ఆమె అనుచరులు అసంతృప్తిని వ్యక్తం చేశారు.

అభ్యసన ఫలితాలు సాధించేలా చూడాలి

పాఠశాల విద్య కార్యదర్శి యోగితారాణా

హైదరాబాద్, మే 3 (నమస్తేతెలంగాణ): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి అభ్యసన ఫలితాలు సాధించేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నదని పాఠశాల విద్య కార్యదర్శి యోగితారాణా సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులకు విద్య నాయకత్వం, విద్యాశాఖ కార్యక్రమాలపై మూడు రోజుల శిక్షణ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాఠ్యాంశాల్లోని ప్రతి అంశంపై విద్యార్థులకు అవగాహన కలిగేలా బోధించాలని నిర్దేశించారు. డీఈవోలు తరచూ పాఠశాలలను సందర్శించి బోధన తీరును పరిశీలించాలని సూచించారు. విద్యాశాఖ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని నైపుణ్యాలు, అంతర్గత శక్తులను వెలికితీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నదని చెప్పారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత సునీతాకృష్ణన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు లైంగిక నేరాల నిరోధం, పోక్సో, ఐటీ చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

మే లోగా శిల్పా ఫ్లై ఓవర్ పనులు పూర్తవ్వాలి

క్షేత్రస్థాయి పర్యటనలో అధికారులకు కమిషనర్ ఆదేశం

సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ): గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వరకు చేపట్టే శిల్పా లే అవుట్ రెండో దశ పనులను మే చివరి వరకు పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావుతో కలిసి ఆయన మల్కం చెరువు, శిల్పా లే అవుట్ రెండో దశ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వరకు మూడు వరుసల బై డైరెక్షన్ శిల్పా లే ఔట్ ఫ్లై ఓవర్ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఫ్లై ఓవర్.. ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్‌కు, కొండాపూర్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు, హైటెక్ సిటీకి వెళ్లేందుకు మార్గం సుగమం చేస్తున్నదని అధికారులు వివరించారు. ఫ్లై ఓవర్ పూర్తికి ఎంత సమయం పడుతందని అడగ్గా.. ప్రస్తుతం బీటీ, ఎల్ఈడీ లైట్ల పనులు కొనసాగుతున్నాయని.. సుమారు ఐదు ఆస్తులకు సంబంధించిన భూ సేకరణ పూర్తి అయితే 15 రోజుల్లో సర్వీస్ రోడ్డు పూర్తి అవుతుందని ఇంజినీర్లు తెలపడంతో ఈ నెల చివరాఖరు వరకు పనులు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. మరో వైపు మల్కం చెరువు వద్ద శానిటేషన్, కుక్కల బెడదపై వాకర్లు ఫిర్యాదు చేయగా వెంటనే నిర్వాహకులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా స్ట్రామ్ వాటర్ డ్రైన్ చెరువులోకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఖాజాగూడ జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా హెచ్‌సిటీ ప్రాజెక్టు ద్వారా చేపట్టే ఫ్లై ఓవర్, అండర్ పాస్ నిర్మాణ స్థలాన్ని కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో జోనల్ ఎస్ఈ శంకర్ నాయక్, డీసీ ప్రశాంతి, ప్రాజెక్టు ఈఈ నమ్యా నాయక్, డిప్యూటీ ఈఈ హరీష్, యూబీడీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రారంభం

అంబర్‌పేట: అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను ఈ నెల 5న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రారంభిస్తారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం అంబర్‌పేట ఫ్లై ఓవర్ పనులను పరిశీలించారు.ఫ్లైఓవర్ సర్వీస్‌రోడ్డులో అసంపూర్తిగా ఉన్న పనుల నిర్మాణం విషయంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లైఓవర్ కింద ఉన్న చెత్తాచెదారం, మట్టికుప్పలు తొలగించకపోవడం, గోడ నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంపై అధికారుల తీరును కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తప్పుపట్టారు.

పురోగతి ప్రాజెక్ట్‌లపై సమీక్ష

సిటీ బ్యూరో, మే03, (నమస్తే తెలంగాణ): జలమండలిలో పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు, మంచినీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ నిర్వహణపై రానున్న మూడు సంవత్సరాలను లక్ష్యంగా చేసుకుని చేపట్టాల్సిన కార్యాచరణపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇలంబర్తి శనివారం సమీక్ష నిర్వహించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఎండీ అశోక్ రెడ్డితో పాటు, ఈడీ మయాంక్ మిట్టల్, డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. జలమండలిలో పురోగతిలో ఉన్న వివిధ ప్రాజెక్టులు, బోర్డులోని వివిధ విభాగాలు వాటి పనితీరు, నగరానికి నీటి సరఫరా, ఎస్టీపీలు, మురుగు శుద్ధి నిర్వహణ గురించి ఎండీ వివరించారు. రెవెన్యూ, ఐటీ, ట్యాంకర్ బుకింగ్– డెలివరీ, మెట్రో కస్టమర్ కేర్, స్కాడా సిస్టం, పని చేసే ప్రాంతాల్లో కార్మికుల కోసం జలమండలి చేపట్టే రక్షణ చర్యలతో పాటు ఇప్పటి దాకా చేపట్టిన ప్రాజెక్టులు కృష్ణా, గోదావరి, హడ్కో రిజర్వాయర్లు, ఓఆర్ఆర్ ఫేజ్– 1, 2 ప్రాజెక్టులు, ముగురు శుద్ధి కోసం చేసే ఎస్టీపీల ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

బౌద్ధుల సంప్రదాయాలు, ఆచారాలనే అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ధరంపాల్

ఖైరతాబాద్, మే 3: గయాలో బౌద్ధ క్షేత్రంలో బౌద్ధుల సంప్రదాయాలు, ఆచారాలనే అమలు చేయాలని భారతీయ బౌద్ధ మహాసభ ప్రతినిధి ప్రొఫెసర్ ధరంపాల్ డిమాండ్ చేశారు. సోమజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ క్రీస్తు పూర్వం మూడో శతాబ్దంలో అశోక చక్రవర్తి నిర్మించిన మహాబోధి ఆలయం గత 2,500 సంవత్సరాల నుంచి ప్రముఖ బౌద్ధక్షేత్రంగా విరాజిల్లుతుందన్నారు. 1949 బౌద్ధగయ ఆలయ చట్టం చేసిన తర్వాత ఆ క్షేత్రం పాలన, నిర్వహణ బాధ్యత మెజార్టీగా బాధ్యతలు బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన వారే చూస్తున్నారని, ఇది బౌద్ధుల సంస్కృతి, విశ్వాసాలకు విరుద్ధమన్నారు. గయాలోని క్షేత్రాన్ని బౌద్ధులకే కేటాయించాలంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 12 నుంచి బౌద్ధ సన్యాలు నిరవధిక దీక్ష చేస్తున్నారని తెలిపారు. 1949 నాటి బుద్ధ గయా ఆలయ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, స్వతంత్ర బౌద్ధ నిర్వహణ ట్రస్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇందిరాపార్కు నుంచి లబర్టీ వద్దగల అంబేద్కర్ విగ్రహం వరకు శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో భారతీయ బౌద్ధ మహాసభ సభ్యులు జి. రాజేశ్వర్ రావు, సూర్య ప్రకాశ్, పరందాములు, చింతోజి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగంలో ఇంజినీర్లదే కీలక పాత్ర

మాదాపూర్, మే 3: నిర్మాణ రంగంలో ఇంజినీర్లదే కీలక పాత్ర అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మాదాపూర్ లోని న్యాక్ లో ఆరు రోజులపాటు శిక్షణ పూర్తి చేసుకున్న అసిస్టెంట్ ఇంజినీర్లకు శనివారం సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విచ్చేసి న్యాక్ ప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనల్ని గుర్తుంచుకోకపోయినా మనం చేసిన పనిని చిరస్థాయిగా గుర్తుండిపోయేలా చేయాలని సూచించారు. యువ ఇంజినీర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా పనులను నాణ్యతా ప్రమాణాలు పాటించి పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాక్ ప్రతినిధులు, అసిస్టెంట్ ఇంజినీర్లు తదితరులు ఉన్నారు.

అసిస్టెంట్ ఇంజనీర్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

10 నుంచి ఖగోళ శాస్త్రంపై అవగాహన తరగతులు

వివరాలు వెల్లడిస్తున్న పృథ్వీపతిరావు

ఖైరతాబాద్, మే 3 : ఖగోళ శాస్త్రంపై విద్యార్థులకు సమగ్రమైన అవగాహన కల్పించేందుకు ఈ నెల 10 నుంచి స్పేస్ సైన్స్ సమ్మర్ క్యాంప్ పేరుతో అవగాహన తరగతులు, ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు స్కిల్ ఎడ్యూ వర్సిటీ వ్యవస్థాపకులు కె. పృథ్వీపతిరావు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 5 నుంచి 12వ తరగతి విద్యార్థులు అర్హులని, ఐఐటీ హైదరాబాద్ కేంద్రంగా ఈ నెల 10 నుంచి 16వ తేదీ జరిగే శిబిరంలో ఇస్రో, నాసా, స్కైరూట్‌కు చెందిన శాస్త్రవేత్తలు, ఐఐటీ నిపుణులు హాజరైన ఖగోళ శాస్త్రంపై అవగాహన కల్పిస్తారన్నారు. అలాగే ఈ నెల 24 నుంచి 31 వరకు వరంగల్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో ప్రత్యేక తరగతులు ఉంటాయన్నారు. శిక్షణలో విద్యార్థులు అత్యాధునిక టెలిస్కోపులతో ఖగోళ పరిశీలన, స్పేస్ ఫొటోగ్రఫీ, విశ్వంలో ప్రయాణించిన అనుభూతి కలిగించేందుకు విద్యార్థులకు వర్చువల్ రియాల్టీ పరికరాలను అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు www.skilleduvarsity. comలో సంప్రదించాలని కోరారు.

వైభవంగా ఆది శంకరాచార్య జయంతి మహోత్సవాలు

చంపాపేట, మే 3: ఆది శంకరాచార్య భక్త సమాజం, తత్వ చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ బంగారయ్య శర్మ నేతృత్వంలో బైరమాల్‌గూడలో జగద్గురు ఆది శంకరాచార్య జయంతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఈ మహోత్సవాల్లో తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య చైర్మన్ వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, అధ్యక్షుడు మోత్కూరి రామేశ్వరరావు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.

అబ్రహం సేవలు మరింత అవసరం

ఎక్సైజ్‌శాఖ కమిషనర్ హరికిరణ్

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): తెలుగు రాష్ట్రాల తొలి ఐఏఎస్ దువ్వూరి సుబ్బారావు నుంచి 41మంది ఐఏఎస్‌ల వద్ద పనిచేసే అవకాశం అందరికీ రాదని, అది బేవరేజెస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్‌గా పదవీ విరమణ పొందిన అబ్రహంకు మాత్రమే దక్కిందని ఎక్సైజ్‌శాఖ కమిషనర్ చెవ్వూరు హరికిరణ్ అన్నారు. టీజీబీసీఎల్ జీఎంగా 39 ఏండ్లు సుదీర్ఘంగా పని చేసిన అబ్రహం శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా అబ్రహం దంపతులను ఉన్నతాధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం ఎక్సైజ్‌శాఖ కమిషనర్ మాట్లాడుతూ.. టీజీబీసీఎల్‌లో అబ్రహం సేవలు మరింత అవసరమని.. ఆ దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో రూ.3వేల కోట్ల నుంచి రూ. 38వేల కోట్ల ఆదాయాన్ని చూశానని, ఈ ఆదాయం పెంచడానికి ఉద్యోగులు మరింతగా కృషి చేయాలని అబ్రహం కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీ, తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గెజిటెడ్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు హరికిషన్, బేవరేజెస్ జీఎంలు శ్రీనివాసరావు, సీహెచ్ ప్రమోద్, తెలంగాణ కార్పొరేషన్ ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి జీవన్, కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాశీనాథ్, జియాడిపో లిక్కర్ కంపెనీ సీఆర్ రవివర్మ దంపతులు, ఆయా డిపోల మేనేజర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

సీవీటీఎస్‌లో వైద్యులకు ప్రత్యేక గుర్తింపు

అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

ఖైరతాబాద్, మే 3 : కార్డియో వాస్క్యులర్ థోరాసిక్ సర్జరీ విభాగం వైద్యులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అన్నారు. కార్డియో వాస్క్యులర్ అండ్ థోరాసిక్ సర్జరీ అంశంపై నిమ్స్ దవాఖానలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, కార్డియో థోరాసిక్ సర్జన్ డాక్టర్ రమేశ్ రావుతో కలిసి ప్రారంభించారు. డైరెక్టర్ మాట్లాడుతూ ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారితో పాటు ఎంఎస్ జనరల్ సర్జరీ విద్యార్థులు, తాజా రెసిడెంట్లకు ఈ విభాగంలో మెరుగైన అవకాశాలు ఉంటాయన్నారు.

ఎల్ఆర్ఎస్‌కు స్పందన అంతంతే

సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో ఎల్ఆర్ఎస్ అంచనాలు తప్పాయి.. ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారులు ఆశించిన స్థాయిలో ముందుకు రాలేదు. సంస్థకు వచ్చిన 108000 దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 14,252 మంది మాత్రమే ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకున్నారు. తద్వారా రూ. 175.53 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకున్నది. ఈ నేపథ్యంలోనే ఎల్ఆర్ఎస్ ద్వారా రూ. 500 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా తలకిందులయ్యాయి. జోనల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయడం, దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి రుసుం చెల్లించాలని కోరిన లబ్ధిదారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. 63 వేల మంది ఫీజు చెల్లించాలని జీహెచ్ఎంసీ సమాచారం పంపించిన స్పందించకపోవడం గమనార్హం.

అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్యాయత్నం

భార్య మృతి

రాజేశ్వరి మృతురాలు

బండ్లగూడ, మే 3: ఆర్థిక ఇబ్బందులతో దంపతులిద్దరు గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో భార్య రాజేశ్వరి (38) మృతి చెందగా భర్త రాజేశ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ క్యాస్టో రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏదులాబాదుకు చెందిన రమేశ్ చిన్ననాటి నుంచి బాలానగర్ లో నివాసం ఉంటున్నారు. స్థానికంగా ఇతడు వెంకటేశ్వర వర్క్ షాప్‌ను నిర్వహిస్తున్నడు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు పూర్తిగా దివాలా తీశారు. భార్య రాజేశ్వరి మతిస్థిమితం కోల్పోయి పిచ్చి ఆసుపత్రిలో చేరింది. అనంతరం ఆమె ఆరోగ్యం కుదుటపడింది. దిక్కుతోచని స్థితిలో ఉన్న వారికి మియాపూర్ లో ఉంటున్న రమేశ్ సోదరి ఎర్రబోడలో ఉన్న